సాక్షి
తూర్పుగోదావరి

శనివారం | 22 | ఏప్రిల్ | 2023



ఈ-స్పోర్ట్స్‌తో బంగారు భవిత


'మొబైల్‌లో లేదా కంప్యూటర్‌లో కాసేపు ఆడుకుంటాం' అనగానే కళ్లెర్రజేసి 'ఛో.. చదువుకో' అని తల్లిదండ్రులు కోపగించుకునే కాలం చెల్లిపోతోంది. - IIలో▸



8 మందికి కోవిడ్

కాకినాడ క్రైం: జిల్లాలో శుక్రవారం ఎనిమిది మందికి కోవిడ్ నిర్ధారణ అయింది. 159 నమూనాలను పరీక్షిస్తే ఈ ఫలితం వెలువడింది.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టాలకు శుక్రవారం 3,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,000, మధ్య డెల్టాకు 550, పశ్చిమ డెల్టాకు 1,800 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

24న మంత్రి విడదల రజిని రాక



ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఈ నెల 24వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ మంత్రి రజిని పర్యటనా వివరాలు తెలిపారు. రాజమహేంద్రవరంలోని వైద్య కళాశాల పనుల పురోగతిని సంబంధిత అధికారులతో మంత్రి పరిశీలిస్తారన్నారు. రాజానగరం నియోజక వర్గంలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలో పాల్గొంటారన్నారు. అనంతరం రాజమహేంద్రవరంలో సాయి బ్లోసమ్స్ మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి హాజరవుతారన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ఏర్పాట్లు చురుగ్గా ప్రారంభమయ్యాయి. ఈ నెల 30 నుంచి వచ్చేనెల 7 వరకు జరగనున్న చినవెంకన్న తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా మే 4న రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుంది. 5న రాత్రి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ పరిసరాలను, దర్శనం క్యూలైన్లను ముస్తాబు చేస్తున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద తాటాకు పందిరిని నిర్మించారు. గుడి సెంటర్‌లోని ఆలయ ప్రధాన కూడలిలో 40 అడుగుల శ్రీవారి భారీ విద్యుత్ కటౌట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ఉత్తమ ఎస్ఈబీ స్టేషన్‌గా రాజమహేంద్రవరం సౌత్



సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీని సత్కరిస్తున్న జిల్లా అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: గడిచిన ఆరునెలల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం(ఎస్ఈబీ)లో ప్రతిభ కనబరిచిన రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ రాష్ట్రంలో ప్రథమస్థానం సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం సౌత్‌స్టేషన్ ఆవరణలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి పిట్టా సోమశేఖర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ మార్గాని రాంబాబు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, ఎస్సైలు చిట్టిబాబు, రామశేషయ్య, సిబ్బందిని అభినందించారు. గడచిన ఆరునెలల కాలంలో సౌత్ స్టేషన్ పరిధిలో 156 కేసులు, 236 అరెస్టులు, 548 బైండోవర్, 14 పీడీయాక్టు కేసులు, 3 గంజాయి కేసులు నమోదు చేశామని సోమశేఖర్ వివరించారు.

కార్పొరేషన్‌లోకి లాలాచెరువు

రాజమహేంద్రవరం సిటీ: లాలాచెరువు గ్రామ పంచాయతీని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో విలీనం చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిందని నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం అక్కడి ఇళ్లు, ఖాళీస్థలాలకు సంబంధించి పన్నుశాతం మారుతుందన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కోర్టులో ఉద్యోగం పేరుతో మోసం చేసిన సంఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. త్రీటౌన్ సీఐ మధుబాబు కథనం ప్రకారం.. దానవాయిపేటకు చెందిన పి.రాజేష్ తన భార్యకు జిల్లా కోర్టులో ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. లలితానగర్‌కు చెందిన గుత్తుల మురళీకి ఈ విషయం తెలిపాడు. ఆయన భార్య విజయలక్ష్మి కోర్టులో క్లర్క్‌గా పనిచేస్తోంది. రాజేష్ భార్యకు ఉద్యోగం ఇచ్చేలా నిమిత్తం రూ.10 లక్షలు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 19న రూ.5 లక్షలను గుత్తుల మురళీకి ఇచ్చారు. ఎన్ని రోజులు గడిచినా ఉద్యోగం రాకపోవడంతో మురళీని నిలదీశారు. అతడి నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో జిల్లా కోర్టులో న్యాయమూర్తికి ఫిర్యాదు చేశాడు.



కొత్త బంగారులోకం

- నేడు, రేపు అక్షయ తృతీయ
- హెచ్‌యూఐడీ నంబర్లతో బంగారు ఆభరణాలు సిద్ధం
- ఆకట్టుకుంటున్న కొత్త రకాల డిజైన్లు
- ఆఫర్లు ప్రకటించిన జ్యూయలరీ షాపులు

రాజమహేంద్రవరం రూరల్: అక్షయ తృతీయ రోజున బంగారం కొంటే లక్ష్మీదేవి మన ఇంటికి వచ్చినట్లేనని, సంపద వృద్ధి చెందుతుందనే నమ్మకం చాలామందిలో ఉంది. మధ్యతరగతి కుటుంబీకులు మొదలుకుని ఉన్నతస్థాయి ప్రజల వరకు అనేక మంది ఈ రోజున ఎంతో కొంత బంగారం కొనడం ఆనవాయితీ. శని, ఆదివారాల్లో అక్షయ తృతీయ ఉండటంతో బంగారు దుకాణాలు కొనుగోళ్లను పెంచుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందుకోసం జ్యూయలరీ షాపులు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి.

సరికొత్త డిజైన్లు

శని, ఆదివారాల్లో అక్షయ తృతీయ ఉండటంతో పుత్తడి వ్యాపారులు నూతన డిజైన్లను అందుబాటులో ఉంచారు. కొన్ని దుకాణాలు ఆఫర్లు ప్రకటించగా, మరికొన్ని అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యాన్ని తెరపైకి తీసుకొచ్చాయి. బంగారం కొనుగోలు సమయంలో మోసపోకుండా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. రెండు గ్రాములు పైబడి కొనుగోలు చేసే బంగారం ఆభరణాలలో హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ (హెచ్‌యూఐడీ) ఆరు అంకెల నంబర్ విధిగా ఉండాలనే నిబంధన పెట్టింది. ఇంతవరకు బీఐఎస్ హాల్‌మార్క్ గుర్తు ఉన్న ఆభరణాలను 916 ప్యూరిటీ నగలుగా వ్యవహరించేవారు. అయితే నకిలీ హాల్‌మార్క్‌తో వినియోగదారులను మోసం చేస్తుండడంతో



మలబార్‌లోని కొనుగోలుదారులు

కేంద్ర ప్రభుత్వం హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ విధానాన్ని తీసుకొచ్చింది. ఆభరణాలపై 22 క్యారెట్ల బంగారం అయితే 22కే 916 మార్క్ పక్కన ఆరు అంకెల యూనిక్ ఐడీ ఉంటుంది. ఈఐడీ ఆధారంగా ఆభరణాలు ఎక్కడ తయారయ్యాయో తెలుసుకోవచ్చు. ఆభరణాలు 20 క్యారెట్లు అయితే 20కే 833 అని, 18 క్యారెట్లు అయితే 18కే 750 అని ఉంటుంది.

పెరిగిన ధరలు

గతేడాది అక్షయ తృతీయతో పోలిస్తే ఈసారి బంగారం ధరలు భారీగా పెరిగాయి. గత అక్షయ తృతీయ సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.47,100 ఉంది. ప్రస్తుతం (శుక్రవారం) 10 గ్రాముల బంగారం రూ.55,500 పలుకుతోంది. అంటే 10 గ్రాములపై రూ.8,400 పెరిగింది. అలాగే 24 క్యారెట్ల బంగారం రూ.61,000 పలుకుతోంది. ఆభరణాలపై ఎంపిక చేసుకున్న డిజైన్ బట్టి తరుగు నాలుగు నుంచి 22 శాతం వరకు (10 గ్రాములకు రూ.2,234 నుంచి రూ.12,287 వరకు) కలుపుతారు.

బిల్లు లేకపోతే ఇబ్బందులే..

బంగారం కొన్నప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. బంగారం పోగొట్టుకున్నా, దొంగలు ఎత్తుకెళ్లినా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ఇది అవసరమవుతుంది. కార్పొరేట్ దుకాణాల్లో మొత్తం ఆన్‌లైన్‌లో వ్యాపారం జరుగుతుంది. తప్పనిసరిగా బిల్లు ఇస్తారు. కొన్ని దుకాణాలు ఇచ్చే బిల్లులపై పాన్, జీఎస్టీ నంబరు, ఇతరత్రా వివరాలు ఉండవు. మరికొందరు తెల్ల పేపరుపైనే రాసి ఇస్తున్నారు. వివరాలు లేని బిల్లు తీసుకుంటే ఇబ్బందులు ఉత్పన్నమవుతాయి. తగిన జాగ్రత్తలతో బంగారం కొనాల్సిన అవసరం ఉంది.

పసిడి అంటే మమకారం

మగువలకు పసిడి అంటే ఎనలేని మమకారం. ఎన్ని ఆభరణాలు ధరిస్తే అంత అందం, హుందాతనం వస్తుందని నమ్మకం. మహిళలను ఆకట్టుకునేలా **వ్యాపారులు నూతన డిజైన్లను సిద్ధం చేశారు. వడ్డాణాలు, గాజులు, చైన్లు, నెక్లెస్‌లతో పాటు డైమండ్లు, రూబీ ఎమరాడ్ కాస్టింగ్, టెంపుల్ జ్యూయలరీ, ఫ్యాషన్ జ్యూయలరీ, రాజ్‌కోట్ లైట్‌వెయిట్ జ్యూయలరీ, కోల్‌కతా ఎనామిల్ వర్క్స్ డిజైన్లు మార్కెట్లో** అందుబాటులో ఉన్నాయి.

బంగారు నాణేలు సిద్ధం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు వెయ్యికి పైగా దుకాణాలు ఉండగా అక్షయ తృతీయ రోజు సుమారు రూ.100 కోట్లకు పైగా వ్యాపారం జరిగే అవకాశం ఉంది. మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసేందుకు వీలుగా బరువు తక్కువగా ఉండే ఆభరణాలను అందుబాటులో ఉంచారు. అలాగే గ్రాము మొదలుకుని 100 గ్రాముల బంగారు నాణేలను కూడా సిద్ధం చేశారు. డిమాండ్‌కు తగ్గట్టుగా అమ్మకాలు చేపట్టడానికి వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు.

హెచ్‌యూఐడీతో ఆభరణాలు సిద్ధం



గతంలో బీఐఎస్ హాల్‌మార్క్‌తో బంగారం ఆభరణాల విక్రయాలు జరిగేవి. ఇప్పుడు ప్రతి ఆభరణంపై హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ (హెచ్‌యుఐడీ) ఉంటుంది. చిన్నషాపు మొదలు కొని కార్పొరేట్ దుకాణం వరకు అందరి వద్ద ఇలాంటి నగలే ఉంటాయి. మేం అక్షయ తృతీయను పురస్కరించుకొని ప్రత్యేకమైన ఆఫర్లు, డిస్కౌంట్లను ప్రకటించాం. నూతన డిజైన్లను తీసుకొచ్చాం.

– జెట్టి రాంబాబు, బంగారు వ్యాపారి, రాజమహేంద్రవరం

మలేరియా నిర్మూలనకు సమన్వయంతో ప్రణాళిక



మలేరియా నిర్మూలనపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి

కాకినాడ సిటీ: 2030 నాటికి మలేరియాను అంతమొందించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు అన్ని శాఖలు కలిసి కట్టుగా పనిచేయాలని జిల్లా మలేరియా అధికారులను ఆదేశించారు. ఈనెల 25న ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్, ఇతర లైన్ డిపార్టుమెంట్‌లతో కలిసి శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి శాఖ నుంచి నివారణ చర్యలకు తీసుకొన్న చర్యలను, ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసిరెడ్డి పద్మ రాక

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ శనివారం రాజమహేంద్రవరం రానున్నారు. మోరంపూడి సమీపంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్లో జరిగే గోదావరి సేవ మంజిరాలు 5వ వార్షికోత్సవానికి ఆమె హాజరవుతారు.

వీరేశ్వర ఆలయంలో పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ సేవలు

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వరస్వామి ఆలయంలో జరిగే వివిధ పూజా కార్యక్రమాలు, సేవలు ఇక నుంచి ఆన్‌లైన్‌లో కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటాయి. ఇతర ప్రాంతాల భక్తులు స్వామికి జరిగే సేవలు, పూజా కార్యక్రమాలు, అన్నదానం వంటి వాటికి https://www.aptemples.ap.gov.in/en& in/temples/VSMRML/aboutTemple వెబ్‌సైట్ ద్వారా మురమళ్ల ఆలయాన్ని ఎంపిక చేసుకొని సేవలు నమోదు చేసుకోవచ్చని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు.

రుడా నిబంధనలపై అవగాహన అవసరం

- చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి
- అధికారులు, సిబ్బందికి అవగాహన



మాట్లాడుతున్న రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరంలోని రుడా కార్యాలయంలో శుక్రవారం వైస్ చైర్మన్ దినేష్ కుమార్ అధ్యక్షతన ఇటీవల రుడాలో కొత్తగా కలిసిన (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని) మండలాల పంచాయతీ అధికారులు, సెక్రటరీలకు శుక్రవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. చైర్ పర్సన్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ రుడా పరిధిలో కొత్తగా కలిసిన ప్రాంతాలకు చెందిన అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నూతన విధానాల అమలులో భాగంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్ సిస్టమ్‌లో పంచాయతీల పరిధిలో ఉండే 300 చ.మీ.లకు లోబడి భవన నిర్మాణాలు, లేవుట్లు, ఇండస్ట్రీల దరఖాస్తులు ఎలా అప్‌లోడ్ చేయాలో తెలుసుకోవాలన్నారు. పంచాయతీలన్నీ అన్నిరకాల రిజిస్టర్లు నిర్వహణ చేయాలన్నారు. ఎటువంటి అక్రమ నిర్మాణాలు, అక్రమ లేవుట్లు చేపట్టినా సదరు పంచాయతీ సెక్రటరీలు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రుడా సెక్రటరీ జి.శైలజావల్లి, రుడా ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ ఎం.అనిత, రావులపాలెం, ఆలమూరు, రామచంద్రపురం రూరల్, కె.గంగవరం, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని పంచాయతీ సెక్రటరీలు, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు

- కలెక్టర్ మాధవీలత
- ఘనంగా జాతీయ పౌర సేవల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషితోనే ప్రజలకు మెరుగైన సేవలు, పథకాలు అందించి, జిల్లాను అగ్రస్థానంలో నిలపగలిగామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 16వ జాతీయ పౌరసేవల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సేవకులం అనే భావన ప్రభుత్వ ఉద్యోగుల్లో తప్పనిసరిగా ఉండాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ తుపానులు, వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో సేవలందించడంలోనూ, దేశాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు కీలకమన్నారు. కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు మన పూర్వీకులు చేసిన త్యాగాల ఫలితమే అన్నారు. వారిని స్మరించుకుంటూ విధులు, బాధ్యతల పట్ల పునరంకితం అవుదామని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు వ్యాఖ్యతగా వ్యవహరించారు. కలెక్టర్, జేసీ, కమిషనర్ సమక్షంలో కేక్ కట్ చేశారు అనంతరం కలెక్టర్ మాధవీలత, జేసీ ఎస్.తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

రబీ దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు

- జేసీ తేజ్ భరత్
- జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం



సమావేశంలో పాల్గొన్న జేసీ తేజ్ భరత్, మండలి చైర్ పర్సన్ బూరుగుపల్లి సుబ్బారావు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రబీ దిగుబడికి అనుగుణంగా రైతుభరోసా కేంద్రాల పరిధిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించామని, అన్ని కేంద్రాల వద్ద గన్నీబ్యాగులను అందుబాటులో ఉంచామని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేసీ మాట్లాడుతూ గత వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చర్చించిన పలు అంశాలపై, ఈ రోజు రైతుల నుంచి వచ్చిన సూచనల మేరకు భవిష్యత్తు కార్యాచరణ అమలు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో రబీకి సంబంధించి 2.50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలుకు కోసం 233 ఆర్‌బీకేలకు 147 రైస్‌మిల్లులను అనుసంధానం చేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 105 ఆర్‌బీకేల ద్వారా 1,239 మంది రైతులు నుంచి 10,901 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించామన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్ పర్సన్ బూరుగుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ మట్టి పరిరక్షణ పథకం కింద మట్టి నమూనాలను సేకరించి, భూసార పరీక్షలను నిర్వహించి, రైతులకు భూసార కార్డులను అందజేయాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వ్యక్తిగతంగా స్ప్రేయర్లు, టార్పాలిన్లు, సూక్ష్మ పోషకాలు యూనిట్లను రాయితీపై మంజూరు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ వ్యవసాయ యంత్ర సేవాపథకాన్ని అన్ని మండలాలకు వర్తింపజేయాలన్నారు. రాయితీపై జనుము విత్తనాలను త్వరలో ఆర్‌బీకేల్లో రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. హార్టికల్చర్ అధికారి వి.రాధాకృష్ణ మాట్లాడుతూ పామాయిల్, కోకో పంటలు సాగు విస్తీర్ణం పెంచే దిశలో భాగంగా ఆయా ఆర్‌బీకేల పరిధిలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తామన్నారు. వీటితో పాటు మామిడి, జీడిమామిడి, కూరగాయల మొక్కలను అందజేస్తామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు కంటే తేజ, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

మెడికల్ హబ్‌గా రాజమహేంద్రవరం

వైద్యాధికారులతో ఎంపీ భరత్ సమీక్ష



ఎంపీ భరత్‌రామ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షకు తగ్గట్టుగా వైద్య సేవలందించాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ వైద్యులు, వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. స్థానికంగా తన కార్యాలయంలో వైద్యాధికారులతో ఎంపీ భరత్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జీజీహెచ్, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల నిర్వహణ, సేవలు, ఆసుపత్రులలో చేపట్టవలసిన అభివృద్ధి, వైద్యుల కొరత తదితర అంశాలపై చర్చించారు. భరత్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం త్వరలోనే మెడికల్ హబ్ కేంద్రంగా రూపొందనుందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల పనులు వేగవంతం చేయాలని, ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరత లేకుండా చూస్తామని చెప్పారు. అవసరమైన పరికరాలు సమకూరేలా ప్రయత్నిస్తామన్నారు. ఆరోగ్య సేవలు సామాన్య ప్రజలకు అందేలా చూడాలని సూచించారు. చిన్న చిన్న వైద్యానికి ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ, సీఎస్ఆర్ నిధులతోనూ ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలోని 11 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను (యూపీహెచ్‌సీ) ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ కేంద్రాలలో 14 రకాల వైద్య పరీక్షలు, 64 రకాల మందులు ఉచితంగా ఇస్తున్నా సరైన ప్రజా స్పందన ఉండటం లేదన్నారు. దీనిపై వైద్యాధికారులు ఫోకస్ పెట్టాలన్నారు. జీజీహెచ్‌లో రోజుకు 700కు పైగా ఓపీ నమోదవుతోందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ తెలిపారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కే వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్ కుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధాకర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ వినూత్న, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, యూపీహెచ్‌సీ డాక్టర్లు, సచివాలయ వైద్య కార్యదర్శులు, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఏపీఐడీసీ డైరెక్టర్ కె.సాగర్ పాల్గొన్నారు.

'గడప గడపకూ' వందరోజులు

- కొవ్వూరులో వేడుకలు
- పాల్గొన్న మంత్రి తానేటి వనిత



కొవ్వూరులో పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారంతో వంద రోజులు పూర్తి చేయగలిగామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో వంద రోజుల వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. గడప గడపకూ కార్యక్రమానికి బయలుదేరిన మంత్రికి పార్టీ శ్రేణులు భారీఎత్తున బాణసంచా కాలుస్తూ, రహదారి పొడవునా పూలు చల్లుతూ, తీన్‌మాన్ వాయిద్యాలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగడానికి ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. నియోజకవర్గంలో 62 సచివాలయాలుండగా ఇప్పటి వరకు 50 శాతం పూర్తి చేశామన్నారు. ఒక వైపు మంత్రిగా శాఖ వ్యవహారాలు చూసుకుంటూ, క్యాంపు కార్యాలయానికి వచ్చే గ్రీవెన్స్ పరిష్కారం, క్యాబినెట్, అసెంబ్లీ సమావేశాల వంటి బాధ్యతలు చూసుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి ఆడపడుచుగా ప్రతి ఒక్కరూ తనను ఆదరించారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్న కుమారి, వైస్ చైర్‌పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు సలాది సందీప్, పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా సీఎం కప్ బ్యాడ్మింటన్ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఏపీ సీఎం కప్ బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారుల ఎంపికలు శుక్రవారం జిల్లా క్రీడా మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ ఇండోర్ స్టేడియంలో ఈ ఎంపికలను ప్రారంభించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, తుని ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. కోచ్ చిన్నారి ఆధ్వర్యాన క్రీడాకారులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి, తిరుపతిలో మే 1 నుంచి 5 వరకూ జరిగే ఏపీ సీఎం కప్ బ్యాడ్మింటన్ పోటీలకు పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేశారు. బాలుర విభాగంలో ఎస్.మన్‌దీపక్, డి.సుమంత్, బీఎల్ సతీష్‌కుమార్, బీజీఎస్ చరణ్; మహిళల విభాగంలో ఎం.నవ్యారావు, బి.చంద్రహారిక, ఎం.దుర్గాప్రియాంక, జి.హేమలత, డి.సత్యసాజన్య ఎంపికయ్యారు.

రేపు షిర్డీసాయిలో కెరీర్ గైడెన్స్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆదివారం కెరీర్ గైడెన్స్ ఇవ్వనున్నట్లు రాజమహేంద్రవరం శ్రీ షిర్డి సాయి విద్యా సంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య శుక్రవారం తెలిపారు. దివాన్ చెరువులోని బీజాపురి క్యాంపస్‌లో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పదో తరగతి తరువాత ఏ కోర్సు చదవాలి, దాని వలన ప్రయోజనాలేమిటి, ఉన్నత విద్యకు ఆ కోర్సులు ఏవిధంగా ఉపయోగపడతాయి వంటి అనేక సందేహాలను నిపుణులు నివృత్తి చేయనున్నారన్నారు. అనంతరం ఇంటర్మీడియెట్‌లో ఐఐటీ ఓరియంటేషన్ కోర్సుకు ఎల్‌శాట్, మెడికల్ ఓరియంటేషన్ కోర్సుకు ఎంశాట్, సివిల్స్, క్లాట్ ఓరియంటేషన్ కోర్సుకు డీశాట్ విభాగాలుగా ప్రవేశ పరీక్ష నిర్వహించి, అర్హులైన వారందరికీ స్కాలర్‌షిప్ అందించనున్నామని తెలిపారు. వివరాలకు 95812 61119 నంబరులో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

సీతానగరం: వంగలపూడి పంచాయతీ పరిధిలోని చినవంగలపూడి గ్రామానికి చెందిన దాసరి దుర్గాశంకర్ (14) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన దుర్గాశంకర్ తన మేనమామ అయిన గండి శివ ఇంటి వద్ద ఉంటూ 9వ తరగతి చదువుతున్నాడు. రేషన్ వ్యాన్ డ్రైవర్ అయిన శివ మార్చి 19న ఊరు వెళ్లాడు. ఆ సమయంలో ఆ వ్యాన్‌ను దుర్గాశంకర్ నడిపాడు. ఈ క్రమంలో చెట్టుకు ఢీకొని ఆ వ్యాన్ ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో మేనమామ తిడతాడనే భయంతో దుర్గాశంకర్ అదే రోజు గడ్డి మందు తాగాడు. అతడిని వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దుర్గాశంకర్ మృతి చెందాడు. మృతుడి తండ్రి దాసరి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ-స్పోర్ట్స్‌తో బంగారు భవిత

- సర్టిఫికెట్ స్థాయి నుంచి పీజీ వరకూ కోర్సులు
- ఏప్రిల్ నుంచి జూన్ మధ్యలో ప్రవేశాలు



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): 'మొబైల్‌లో లేదా కంప్యూటర్‌లో కాసేపు ఆడుకుంటాం' అనగానే కళ్లెర్రజేసి 'ఫో.. చదువుకో' అని తల్లిదండ్రులు కోపగించుకునే కాలం చెల్లిపోతోంది. 'ఆడినంత ఆడుకో.. ఉద్యోగం తెచ్చుకో' అంటూ దగ్గరుండి ఆడించే రోజులు రాబోతున్నాయి. ఎందుకంటే ఇప్పుడు 'ఈ-స్పోర్ట్స్' మంచి కెరీర్‌గా ఎదుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా అవకాశాలను అందిస్తోంది. ఇందుకోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో రకరకాల కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో పూర్తి నైపుణ్యాలను పెంచుకుంటే భారీ వేతనంతో కొలువులు కొట్టేయవచ్చు. ఆన్‌లైన్‌లో ఆటలు ఆడే వారికి పబ్జీ, ఫోర్ట్‌నైట్, రమ్మీ, డోటా, ఫిఫా, స్టార్ క్రాఫ్ట్ కంబాట్స్, కౌంటర్ స్ట్రయిక్ - గ్లోబల్ అఫెన్సివ్, అపెక్స్ లెజెండ్స్ వంటి పేర్లు చాలా సుపరిచితమైనవి. ప్రయాణాల్లో, ఖాళీ సమయాల్లో మొబైల్ పట్టుకుని యుద్ధభూమిలో దూకినంత సీరియస్‌గా చాలా మంది గేమ్‌లు ఆడేస్తుంటారు. మల్టీప్లేయర్ విధానమూ వీటిలో కనిపిస్తుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగా ఆడుకునే సౌకర్యం ఉంటుంది. అందుకే ఆన్‌లైన్ గేమింగ్‌పై అందరికీ ఆసక్తి పెరుగుతోంది. ఇది ఏకంగా పోటీలు నిర్వహించే స్థాయికి ఎదిగింది. ఈ రంగాన్ని ఇప్పుడు ఈ-స్పోర్ట్స్ లేదా ప్రొఫెషనల్ గేమింగ్‌గా పిలుస్తున్నారు.

ఈ-స్పోర్ట్స్ అంటే..

ఈ-స్పోర్ట్స్ అంటే గేమింగ్ అనే భావన ఉంది. కానీ రెండింటి మధ్య స్పష్టమైన తేడా ఉంది. గేమింగ్ ఆహ్లాదం కోసం ఉపయోగించే సాధారణ ప్రక్రియ. ఈ-స్పోర్ట్స్‌కు కొన్ని నైపుణ్యాలు, శిక్షణ అవసరమవుతాయి.

దీనిని ప్రొఫెషనల్ స్పోర్ట్స్‌గా పరిగణిస్తున్నారు. ఆడేవారికి జీతభత్యాలు, నగదు బహుమతులు ఉంటాయి. ఈ-స్పోర్ట్స్‌ను వినోదంగానే భావించినప్పటికీ దీనిలో నిపుణులుగా మారడానికి ఆటగాళ్లు ఎంతో శ్రమ, అంకిత భావం ప్రదర్శించాల్సి ఉంటుంది. నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి గంటల సమయాన్ని వెచ్చించాలి. ఏషియన్ గేమ్స్ వంటి అంతర్జాతీయ స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో వీటికి గుర్తింపు వచ్చింది. చిన్నతనం నుంచీ మొబైల్, కంప్యూటర్ గేమ్స్‌పై ఆసక్తి ఉన్న వారు ఈ-స్పోర్ట్స్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు.

ఎలా ప్రవేశించవచ్చు?

మన దేశంలో ఈ-స్పోర్ట్స్‌కు సంబంధించి డిగ్రీలు లేవు. విదేశాల్లో ముఖ్యంగా యూకే, యూఎస్ఏల్లో కొన్ని కళాశాలలు ప్రొఫెషనల్ డిగ్రీలు అందిస్తున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ స్టాఫర్డ్‌షైర్ (యూకే), బెకర్ కాలేజీ ఇన్ మసాచుసెట్స్ (యూఎస్ఏ) ఈ-స్పోర్ట్స్ కోర్సులు అందిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఈ-స్పోర్ట్స్ అథ్లెట్, మేనేజ్‌మెంట్ కోర్సులను కొన్ని సంస్థలు అందిస్తున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీతో ఎంఓయూ చేసుకున్న కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు, బెంగళూరులోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గేమింగ్ అండ్ యానిమేషన్, జీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ ఆర్ట్స్, ముంబైకి చెందిన స్కూల్ ఆఫ్ డిజైన్ అండ్ ఇన్నోవేషన్, మాయా అకాడమీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సినిమాటిక్స్, నోయిడాలోని అకాడమీ ఆఫ్ యానిమేషన్ అండ్ గేమింగ్‌తో పాటు హైదరాబాద్, పుణెకు చెందిన పలు సంస్థలు కూడా ఈ-స్పోర్ట్స్ కోర్సులు అందిస్తున్నాయి.

ఏయే కోర్సులంటే..

- సర్టిఫికెట్ ఇన్ గేమింగ్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ గేమ్ ఆర్ట్స్, డిజైన్ కోర్సులు ఉన్నాయి. దీని వ్యవధి ఆరు నెలలు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి పూర్తి చేసిన వారు అర్హులు.
- డిగ్రీ స్థాయిలో బీఎస్సీ, బీఎఫ్ఏ, బి.డిజైన్ (గేమ్ డిజైనింగ్), బీటెక్ (కంప్యూటర్ సైన్స్ అండర్ గేమ్ డెవలప్‌మెంట్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కోర్సు కాల వ్యవధి మూడేళ్లు. గుర్తింపు పొందిన ఏదైన బోర్డు నుంచి ఇంటర్ పూర్తి చేసిన వారు అర్హులు.
- పీజీ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ (మల్టీమీడియా అండ్ యానిమేషన్ విత్ గేమ్ ఆర్ట్ అండ్ డిజైన్), ఎమ్మెస్సీ గేమింగ్, గేమ్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్, మల్టీమీడియా అండ్ యానిమేషన్, ఎం.డిజైన్ కోర్సులు ఉన్నాయి. కాల వ్యవధి రెండేళ్లు. టెక్నికల్ విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు.
- వీటికి నోటిఫికేషన్లు సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ మధ్య విడుదలవుతాయి. డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి.

ఉద్యోగావకాశాలు

ఆన్‌లైన్ గేమింగ్ అయినప్పటికీ సాఫ్ట్‌వేర్‌తో పాటు ఇతర విభాగాల వారికీ అవకాశాలున్నాయి. గేమ్ డిజైన్ యానిమేటర్, మోషన్ కాప్చర్ ఆర్టిస్ట్, సోషల్ మీడియా అసోసియేట్, మేనేజర్, బూత్ ప్లానర్, విజువలైజేషన్ ఆర్టిస్ట్, గేమ్ టెస్టర్, క్వాలిటీ ఎస్యూరెన్స్ (క్యూఏ) టెస్టర్, వీడియో గేమింగ్ కంపోజర్, వేర్‌హౌస్ మేనేజర్, మార్కెటింగ్ తదితర ఉద్యోగాలు వచ్చే అవకాశాలుంటాయి. ఈ-స్పోర్ట్స్‌లో ఆసక్తి, అభిరుచికి తగిన కోర్సు ఎంచుకుని నైపుణ్యాలు పెంచుకుంటే భవిష్యత్తు బంగారమే.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

- 21 కేంద్రాల్లో నిర్వహణ
- రాయనున్న 7,915 మంది విద్యార్థులు

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 21 గురుకుల పాఠశాలల్లో నిర్వహించే ఈ పరీక్షకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి 1,600 సీట్లకు గాను 4,043 మంది పేద, మధ్య తరగతి, అల్పాదాయ వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి 1,722 సీట్లకు 3,872 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాలికలకు 16, బాలురకు 5 గురుకుల పాఠశాలలున్నాయి. కాకినాడ జిల్లాలో తొమ్మిది, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఒక్కో జిల్లాలో ఆరు వంతున గురుకుల పాఠశాలలున్నాయి. అనపర్తి మండలం కొత్తూరు జూనియర్ కళాశాల మినహా మిగిలిన 20 గురుకులాల్లో ఐదో తరగతికి 80 సీట్ల చొప్పున 1,600, తుని మండలం లోవకొత్తూరులోని పాఠశాల మినహా మిగిలిన 20 జూనియర్ కళాశాలల్లో 1,600 సీట్లు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఐదో తరగతిలో ప్రవేశానికి తూర్పు గోదావరి జిల్లాలోని గురుకులాల్లో 400 సీట్లకు 1,396 మంది, కాకినాడ జిల్లాలో 720 సీట్లకు 1,909 మంది, కోనసీమ జిల్లాలో 480 సీట్లకు 738 మంది పోటీ పడుతున్నారు. అలాగే ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి తూర్పు గోదావరి జిల్లాలోని గురుకుల జూనియర్ కళాశాలల్లో 520 సీట్లకు 1,289 మంది, కాకినాడ జిల్లాలో 720 సీట్లకు 1,761 మంది, కోనసీమ జిల్లాలో 480 సీట్లకు 822 మంది పోటీ పడుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఇప్పటికే అవకాశం కల్పించారు. హాల్ టికెట్‌లో ఉన్న కేంద్రంలో మాత్రమే పరీక్ష రాసేందుకు అనుమతిస్తారు.

అన్ని ఏర్పాట్లూ చేశాం



గురుకుల పాఠశాలల్లో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు అసౌకర్యానికి గురి కాకుండా మౌలిక సదుపాయాలు కల్పించాం. కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు మాస్క్ ధరించి పరీక్షకు రావాలి. సెల్‌ఫోన్ సహా ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులనూ పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.

– అంగడి మురళీకృష్ణ, జిల్లా కో ఆర్డినేటర్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, కాకినాడ

వచ్చే నెలలో వైఎస్సార్ మత్స్యకార భరోసా

- వేట విరామ భృతి అందజేత
- రాష్ట్ర స్థాయి సమీక్షలు
- మంత్రి సీదిరి అప్పలరాజు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు. చిత్రంలో కమిషనర్ కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా వచ్చే నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేట విరామ భృతి అందిస్తారని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. కాకినాడ మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ(ఎస్ఐఎఫ్‌టీ)లో మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. మెరైన్ ఫిషింగ్, ఆక్వా, మత్స్య సహకార సంఘాల ద్వారా చెరువుల్లో చేపల పెంపకం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 15 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం అమలవుతున్న నేపథ్యంలో.. ఇంటి వద్ద ఉంటున్న మత్స్యకారులను రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా ఆదుకుంటుందని చెప్పారు. రైతుభరోసా తీసుకుంటున్నందున తమకు మత్స్యకార భరోసా ఇవ్వడం లేదంటూ చాలా మంది మత్స్యకారులు చెబుతున్నారని, దీనిని వారికి కూడా వర్తింపజేయాలని ఆదేశించారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా ఎన్యూమరేషన్‌పై సమీక్షించారు. డీజిల్ సబ్సిడీ పెంచేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు.

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై)తో పాటు పలు పథకాల ద్వారా మత్స్యకారులకు అందుతున్న ప్రయోజనాలపై సమీక్షించారు. పీఎంఎంఎస్‌వై ద్వారా 40 శాతం మాత్రమే సబ్సిడీ అందుతూండటంతో యూనిట్ల ఏర్పాటుకు చాలా మంది ముందుకు రావడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎక్కువ యూనిట్లు గ్రౌండ్ అయ్యేందుకు ఫిషరీష్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఎఫ్‌డీఎస్) ద్వారా మరో 35 శాతం సబ్సిడీ అందించేందుకు ప్రతిపాదించాలని ఆదేశించారు. తద్వారా మొత్తం 75 శాతం వరకూ సబ్సిడీ అందుతుందని చెప్పారు. గతంలో మత్స్యకారులకు బోటు, ఇంజన్, వల కలిపి ఒక యూనిట్‌గా ఇస్తూండటంతో మత్స్యకారులు వెనకడుగు వేస్తున్నారని, అవసరమైన వారికి వాటిని విడివిడిగా ఇవ్వాలని ప్రతిపాదించారు. స్థానికంగా చేపల వినియోగం పెంచేందుకు ఫిష్ ఆంధ్రా మినీ అవుట్‌లెట్లు ఏర్పాటును ప్రోత్సహించాలని 26 జిల్లాల మత్స్యశాఖ అధికారులకు సూచించారు. సముద్రంలో లభించే చేపలు, రొయ్యలు, పీతలతో పాటు చెరువుల్లో పండించే రొయ్యల వంటి వాటి వినియోగం పెంపుపై పలు సూచనలు చేశారు. మత్స్యకార సహకార సంఘాల ఆధీనంలోని చెరువుల్లో చేపల పెంపకానికి అవసరమైన చేప పిల్లలను 75 శాతం రాయితీపై అందించేందుకు ప్రతిపాదించాలని అధికారులను ఆదేశించారు.

అంతకు ముందు ఉదయం జరిగిన కార్యక్రమంలో కమిషనర్ కన్నబాబు మాట్లాడారు. సముద్రంలో చేపల వేట నిషేధం అమలుకు పకడ్బందీగా పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ ఎస్.అంజలి, ఎస్ఐఎఫ్‌టీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివ సాంబరాజ్యం, కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చిట్టీల పేరుతో రూ.కోటికి టోకరా

పెద్దాపురం: చిట్టీలు, అధిక వడ్డీ ఆశ చూపించి ఓ వ్యక్తి రూ.కోటికి టోకరా వేసిన ఘటన కట్టమూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాసంసెట్టి శివ గ్రామంలో చిట్టీలు నిర్వహిస్తూ, గ్రామస్తుల నుంచి సొమ్ములు వసూలు చేశాడు. అతడిని నమ్మి పలువురు పెళ్లిళ్లు, ఆసుపత్రి ఖర్చులు, ఇతర అవసరాల నిమిత్తం చిట్టీ వేశారు. ఈ నేపథ్యంలో శివ కుటుంబ సభ్యులతో సహా ఉడాయించాడంటూ గ్రామస్తులు పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై ఫిర్యాదు అందిందని, పూర్తి విచారణ జరిపి, చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్సై వెలుగుల సురేష్ చెప్పారు.

బ్యాంక్ ఖాతాలో రూ.40 వేలు మాయం

కరప: ఖాతాలో తాను దాచుకున్న సొమ్ములు తన ప్రమేయం లేకుండా మాయమయ్యాయంటూ ఓ బాధితుడు బ్యాంకు అధికారులను ఆశ్రయించాడు. వివరాలివీ.. కరప గ్రామానికి చెందిన బోడపునీడి సత్యనారాయణకు పెదపూడి మండలం సంపర యూనియన్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. అందులో అతడు రూ.44,195 దాచుకున్నాడు. డబ్బులు అవసరమై గురువారం బ్యాంక్‌కు వెళ్లాడు.

అయితే ఆయన ఖాతాలో రూ.4,195 మాత్రమే ఉందని సిబ్బంది చెప్పడంతో అవాక్కయ్యాడు. తాను బ్యాంక్‌లో కానీ, ఏటీఎం నుంచి కానీ డబ్బులు తీసుకోలేదని, తన డబ్బులు ఎలా పోయాయని సత్యనారాయణ ప్రశ్నించాడు. మార్చి 22, 31, ఈ నెల 2, 4 తేదీల్లో రూ.10 వేల చొప్పున నాలుగుసార్లు డ్రా చేసినట్టు బ్యాంక్ సిబ్బంది తెలిపారు. తన ఖాతాలో సొమ్ములు ఎవరు డ్రా చేశారో విచారణ జరిపి, న్యాయం చేయాలంటూ బాధితుడు శుక్రవారం బ్రాంచి మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు.

విపత్తుల్లో ప్రజలను కాపాడాలి

- పీఆర్ అండ్ ఆర్‌డీ అసిస్టెంట్ కమిషనర్ సూచన
- ఐదు జిల్లాల్లోని 981 మంది ఆపద మిత్రలకు పూర్తయిన శిక్షణ


ఆపద మిత్రలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కృష్ణమోహన్ తదితరులు

సామర్లకోట: విపత్తులు సంభవించిన సమయంలో ప్రజలను అప్రమత్తం చేసి, రక్షించాల్సిన బాధ్యత ఆపద మిత్రలపై ఉందని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (పీఆర్ అండ్ ఆర్‌డీ) అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో ఆపద మిత్రల శిక్షణను గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభించారు. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు చెందిన వారికి తొమ్మిది బ్యాచ్‌లలో శిక్షణ పూర్తి చేశారు. ప్రతి బ్యాచ్‌కు 12 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. చివరి బ్యాచ్ శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణమోహన్ మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడిన సమయంలో బాధితులకు సహాయ కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 5,400 ఆపద మిత్రలను ఎంపిక చేశామని చెప్పారు. ప్రకృతి విపత్తులను నివారించడం ఎవరికీ సాధ్యం కాదని, అటువంటి పరిస్థితుల్లో ముందు జాగ్రత్తలు తీసుకోవడమే కీలకమని అన్నారు. విపత్తుల సమయంలో బాధితులను కాపాడేందుకు ఉన్న తుపాను షెల్టర్లను ఆపద మిత్రలకు స్వాధీనం చేస్తామని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని, విపత్తుల సమయంలో సకాలంలో స్పందించి, ప్రాణనష్టం లేకుండా చూడాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి ఆపద మిత్రకు రూ.10 వేల విలువైన కిట్లు అందజేశామన్నారు. ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు ఉపయోగపడే పరికరాలు ఈ కిట్లలో ఉన్నాయని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 150, అనకాపల్లి నుంచి 200, తూర్పు గోదావరి నుంచి 150, కోనసీమ నుంచి 300, కాకినాడ నుంచి 150 మంది చొప్పున ఆపద మిత్రలకు శిక్షణ ఇచ్చామని వివరించారు. ఆయా బ్యాచ్‌ల్లో శిక్షణకు హాజరు కాలేకపోయిన ఏలూరు నుంచి ఒకరు, ఎన్టీఆర్ జిల్లా నుంచి ఆరుగురు, విశాఖపట్నం నుంచి 20 మంది, పశ్చిమ గోదావరి నుంచి నలుగురికి కూడా అదనంగా శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఇక్కడ మొత్తం 950 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉండగా 981 మంది ఇచ్చామని కృష్ణమోహన్ చెప్పారు. కార్యక్రమంలో విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్మయి, ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, బి.ఆంజనేయులు, పి.శ్రీనివాసరావు, కేఆర్ నిహారిక, వి.ప్రసాద్, ఎస్‌కే మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆపద మిత్రలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఫ్యాకల్టీలను ఆపద మిత్రలు సత్కరించారు.

నాణ్యమైన విద్య అందించాలి

- ఇందుకు వర్సిటీలు కృషి చేయాలి
- ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి
- ఘనంగా 'నన్నయ' వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి

రాజానగరం: రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేందుకు అనువైన, నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఎంతో ఉందని, ఇందుకు విశ్వవిద్యాలయాలన్నీ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 17వ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ, నాణ్యమైన విద్యతో పాటు పని నైపుణ్యాలను కూడా పెంపొందించి బయటకు పంపిస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన అని, అందుకు అనుగుణంగా పని చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో 3.50 లక్షల మంది ఇంటర్న్‌షిప్‌లు చేశారన్నారు. విశ్వవిద్యాలయాలు ఉన్నత ఆలోచనలతో పని చేయాలని సూచించారు.

ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానాన్ని సమర్థంగా అమలు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. సుమారు 400 అనుబంధ కళాశాలలతో అతి పెద్ద విశ్వవిద్యాలయంగా 'నన్నయ' ఉందని చెప్పారు. ఎన్ని సమస్యలున్నా సమర్థంగా ఎదుర్కొంటూ అభివృద్ధి పథంలో పయనిస్తోందని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ, వర్సిటీ ప్రగతికి పాటు పడాలని అన్నారు. పాలక మండలి సభ్యులు ఆచార్య కేఎస్ రమేష్, డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, ఓఎస్‌డీ ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, డీన్ ఆచార్య పి.సురేష్‌వర్మ, కాకినాడ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కమలాకుమారి, ఆర్‌అండ్‌డీ సెల్ ఆచార్య కె.రమణేశ్వరి తదితరులు కూడా ప్రసంగించారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీతో మహిళకు బెదిరింపులు

నిందితుడి అరెస్ట్

అల్లిపురం: ఓ మహిళ ఫొటోను మార్ఫింగ్ చేసి.. ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీ ద్వారా బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తిని విశాఖపట్నం సైబర్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ.. తూర్పు గోదావరి జిల్లా చాగల్లుకు చెందిన వట్టికూటి మణిశర్మ అవివాహిత మహిళ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నుంచి డీపీని డౌన్‌లోడ్ చేశాడు. దానిని న్యూడ్‌గా మార్ఫింగ్ చేసి ఆ ఫొటోలపై సెక్స్ గర్ల్ అని టైపు చేశాడు. వాటిని బాధితురాలికి పంపించి డబ్బులు పంపించాలని, లేకపోతే అందరికీ ఈ ఫొటోలు పంపిస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడు. దీంతో ఆమె సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.భవానీ ప్రసాద్ సాంకేతిక సహాయంతో దర్యాప్తు చేసి, వట్టికూటి మణిశర్మే నిందితుడని గుర్తించారు. అతడు కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ చదివాడు. టెక్నాలజీపై ఉన్న అవగాహనతో ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీ క్రియేట్ చేసి, నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. సైబర్ క్రైం బాధితులు www.cyber crime. gov.inలో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930, 94906 17917కు ఫిర్యాదు చేయాలని భవానీ ప్రసాద్ సూచించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲ 23	59,655	
నిఫ్టీ 0	17,624	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,077	▲	20
డోజోన్స్	33,876	▲	8
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,914	▲	12
డాక్స్	15,882	▲	86
షాంఘై	3,301	▼	2
నికాయ్	28,564	▲	93

అమెరికా బ్రిటన్ జర్మనీ చైనా జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్) 60,191	▼	425
బంగారం (22 క్యారెట్) 59,950	▼	423
వెండి (కిలో) 74,773	▼	646

సింఫనీ బీఎల్‌డీసీ ఎయిర్‌కూలర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రపంచంలో తొలిసారిగా బ్రష్‌లెస్ డీసీ ఎలక్ట్రిక్ మోటార్ (బీఎల్‌డీసీ) టెక్నాలజీతో పనిచేసే ఎయిర్ కూలర్లను సింఫనీ భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సంప్రదాయ ఎయిర్‌కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తాయని కంపెనీ వెల్లడించింది. 30, 55, 80 లీటర్ల సామర్థ్యంతో మూడు మోడళ్లను అందుబాటులోకి తెచ్చినట్టు సింఫనీ సీఎండీ అచల్ బకేరీ తెలిపారు.

తనిష్క్ నుంచి 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' చెవి రింగులు



హైదరాబాద్: టాటా గ్రూప్ కంపెనీ తనిష్క్, అక్షయ తృతీయ సందర్భంగా బంగారం, వజ్రాలతో తీర్చిదిద్దిన చెవి రింగులను 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' పేరిట విడుదల చేసింది. ఈ నూతన కలెక్షన్‌లో సంప్రదాయ ఝుంకీలు, ఆకర్షణీయ స్టడ్‌లు, డ్రాప్ ఇయర్ రింగ్స్ మరెన్నో ఉన్నాయి. వీటిని 18 క్యారెట్, 22 క్యారెట్లలో రూపొందించారు. పండుగ వేళ బంగారు ఆభరణాల మేకింగ్, డైమండ్ జ్యువెలరీ విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. ఈ ఏప్రిల్ 24 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-4-2023	
విశాఖ	375-00
చిత్తూరు	418-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	365-00
విజయవాడ	365-00
రిటైల్ ధర (డజను)	60.00
21-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	358-00
వరంగల్	360-00
రిటైల్ ధర	4.20

రిలయన్స్ లాభాల రికార్డ్!

- క్యూ4లో నికర లాభం రూ. 19,299 కోట్లు
- కంపెనీ చరిత్రలోనే అత్యధికం
- రూ. 10 లక్షల కోట్లకు ఆదాయం



ఆర్థిక వృద్ధిలో భాగం

"డిజిటల్ కనెక్టివిటీ, ఆర్గనైజ్‌డ్ రిటైల్ విభాగాలలో కంపెనీ కార్యకలాపాలు వ్యవస్థాగత సామర్థ్యాలకు బలాన్నిస్తున్నాయి. తద్వారా ప్రపంచంలోనే వేగవంత వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థలో భాగమవుతున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని విడదీసి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేరుతో లిస్ట్ చేయనున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ఎంజే ఫీల్డ్, ఆర్‌క్లస్టర్ తదితరాలతో కలిపి కేజీ-డీ6 బ్లాకులో గ్యాస్ ఉత్పత్తి రోజుకి 3 కోట్ల ప్రామాణిక ఘనపుమీటర్లకు చేరే వీలుంది.

–ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండీ

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో సరికొత్త రికార్డును సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 19,299 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 16,203 కోట్లు మాత్రమే ఆర్జించింది. రిటైల్, టెలికం విభాగాలతోపాటు చమురు, పెట్రోకెమికల్స్ బిజినెస్ వృద్ధి ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2.14 లక్షల కోట్ల నుంచి రూ. 2.19 లక్షల కోట్లకు బలపడింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 66,702 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది కూడా సరికొత్త రికార్డుకాగా.. 2021-22లో రూ. కేవలం 60,705 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరింది. 2021-22లో రూ. 7.36 లక్షల కోట్ల ఆదాయం మాత్రమే అందుకుంది. పూర్తి ఏడాదికి ఆర్‌ఐఎల్ నిర్వహణ లాభం(ఇబిటా) తొలిసారి రూ. 1,54,691 కోట్లను తాకింది. ఇది 23 శాతం వృద్ధి. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు రూ. 1,41,809 కోట్లుకాగా.. కంపెనీవద్దగల రూ. 1,93,282 కోట్ల నగదు బ్యాలెన్స్‌ను మినహాయిస్తే నికర రుణ భారం వార్షిక ఇబిటాకంటే తక్కువగా రూ. 1,10,218 కోట్లుగా నమోదైంది.

అన్ని విభాగాల జోరు: క్యూ4లో ఆర్‌ఐఎల్ ఇబిటా 22 శాతం జంప్‌చేసి రూ. 41,389 కోట్లను తాకింది. రిఫైనింగ్, పెట్రోకెమికల్స్(ఓటూసీ) ఇబిటా 14 శాతంపైగా ఎగసి రూ. 16,293 కోట్లకు, టెలికంసహా డిజిటల్ సర్వీసులు 17 శాతం మెరుగుపడి రూ. 12,767 కోట్లకు, రిటైల్ విభాగం 33 శాతం దూసుకెళ్లి రూ. 4,769 కోట్లకు, ఆయిల్, గ్యాస్ ఇబిటా రెట్టింపై రూ. 3,801 కోట్లకు చేరాయి. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ లాభాలపై రూ. 711 కోట్లమేర ప్రభావం చూపినట్లు ఆర్‌ఐఎల్ పేర్కొంది. అంతక్రితం క్యూ4లో రూ. 1,898 కోట్లమేర ప్రభావం పడినట్లు ప్రస్తావించింది.

ఆర్‌ఐఎల్ షేరు స్వల్ప వృద్ధితో 2,351 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.

రిలయన్స్ రిటైల్ భళా

గతేడాది(2022-23) క్యూ4(జనవరి-మార్చి)లో రిలయన్స్ రిటైల్ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,415 కోట్లను తాకింది. 2021-22 క్యూ4లో రూ. 2,139 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 21 శాతం ఎగసి రూ. 61,559 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 50,834 కోట్ల అమ్మకాలు సాధించింది. ఆదాయంలో డిజిటల్, న్యూ కామర్స్ బిజినెస్ వాటా 17 శాతానికి చేరింది. ఇక మొత్తం స్టోర్ల సంఖ్య 18,040కు చేరింది. క్యూ4లో 2,844 స్టోర్లను జత చేసుకుంది. సర్వీసులతో కలిపి క్యూ4లో ఆదాయం రూ. 69,267 కోట్లను తాకగా.. ఇబిటా 33 శాతం వృద్ధితో రూ. 4,914 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మొత్తం ఆదాయం 32 శాతం జంప్‌చేసి రూ. 2,30,931 కోట్లను తాకింది. నికర లాభం 30 శాతం ఎగసి రూ. 9,181 కోట్లయ్యింది. సర్వీసులతో కలిపి స్థూల ఆదాయం రూ. 2,60,364 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిటైల్ రంగంలో రిలయన్స్ అత్యుత్తమ వృద్ధిని చూపుతున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈషా ఎం.అంబానీ పేర్కొన్నారు.

జియో లాభం జూమ్

క్యూ4లో రూ. 4,984 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్‌ఐఎల్ అనుబంధ సంస్థ, డిజిటల్ సర్వీసుల దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 16 శాతం బలపడి రూ. 4,984 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 4,313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం పుంజుకుని రూ. 25,465 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 22,261 కోట్ల ఆదాయం నమోదైంది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 6.7 శాతం మెరుగై రూ. 178.8కు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 19,124 కోట్లయ్యింది. 2021-22లో రూ. 15,487 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 20 శాతం ఎగసి రూ. 1,15,099 కోట్లకు చేరింది. క్యూ4లో 2.9 కోట్లమంది జత కలవడంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 7 శాతం పెరిగి 43.93 కోట్లను తాకింది.

సంపదలో 6 శాతం పుత్తడికి..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌తోపాటు చైనాకు చెందిన అల్ట్రా-హై నెట్ వర్త్ వ్యక్తులు (యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) గత సంవత్సరం పెట్టుబడి పెట్టదగిన సంపదలో 6 శాతం బంగారంలో ఉంచారని ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. '8 శాతం కేటాయింపులతో ఆస్ట్రేలియాకు చెందిన యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐలు తొలి స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా సగటు 3 శాతం కాగా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఇది 4 శాతంగా ఉంది. పెట్టుబడి పెట్టదగిన సంపదలో బంగారానికి భారతీయులు చేసిన కేటాయింపులు 2018లో 4 శాతం నమోదైంది. సంవత్సరాలుగా పుత్తడి అందించిన గణనీయమైన రాబడి ఈ పెరుగుదలకు కారణం. 2018-19 నుంచి 2022-23 మధ్య పసిడి 69 శాతం కంటే ఎక్కువగా రాబడిని అందించింది. మహమ్మారి తక్కువ వడ్డీ రేటుకు దారితీసింది. అంతర్జాతీయ కేంద్ర బ్యాంకులు అనుసరించిన సులభ నగదు లభ్యత వ్యూహం ధరలను భారీగా పెంచింది' అని నివేదిక వివరించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో స్థిరత్వాన్ని అందించే, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనాలను ఆశ్రయిస్తున్నారని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు.

హింద్ జింక్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 2,583 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి (క్యూ4)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,583 కోట్లకు పరిమితమైంది. పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 2,928 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,074 కోట్ల నుంచి రూ. 8,863 కోట్లకు నీరసించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 10,511 కోట్లకు ఎగసింది.

సెన్సెక్స్ లాభం, నిఫ్టీ అక్కడే

- ట్రేడింగ్‌లో ఒడిదుడుకులు
- ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు



ముంబై: జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్ ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్ సెషన్ నుంచి మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. ఉదయం సెన్సెక్స్ 94 పాయింట్ల నష్టంతో 59,538 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 369 పాయింట్ల పరిధిలో 59,413 వద్ద కనిష్టాన్ని, 59,781 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 23 పాయింట్లు పెరిగి 59,655 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16 పాయింట్ల లాభంతో 17,640 ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,554 – 17,663 వద్ద రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి ఎలాంటి లాభనష్టాలకు లోనవకుండా గురువారం ముగింపు 17,624 వద్దే స్థిరపడింది. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మీడియా, ఫార్మా షేర్లకు రాణించాయి. మెటల్, ఆటో, ఫైనాన్స్, బ్యాంకింగ్, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

సాక్షి స్పోర్ట్స్



ఆధిక్యంలో అర్జున్

సాటీ జుల్డిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో ఎనిమిది రౌండ్‌ల తర్వాత తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఏడు పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన నాలుగు గేముల్లో మూడింట గెలిచిన అర్జున్, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. వఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), బిబిసారా (కజకిస్తాన్), బోరిస్ గెల్ఫాండ్ (ఇజ్రాయెల్)లపై నెగ్గిన అర్జున్ జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్‌తో జరిగిన గేమ్‌ను 'డ్రా'గా ముగించాడు. 12 మంది అగ్రశ్రేణి ప్లేయర్ల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. నేడు చివరి మూడు రౌండ్‌లు జరుగుతాయి.

'పారిస్' టికెట్ల కోసం 40 లక్షల మంది దరఖాస్తు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలను ప్రత్యక్షంగా తిలకించేందుకు రెండో దశలో 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే నెలలో ఆన్‌లైన్ లాటరీ ద్వారా 13 లక్షల మందిని ఎంపిక చేస్తారు. తొలి దశలో 32 లక్షల టికెట్లు అమ్ముడుపోయాయి.

పసిడి పోరుకు జ్యోతి సురేఖ జోడీ


జ్యోతి సురేఖ, ఓజస్ ప్రవీణ్

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు పతకం ఖరారైంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర ప్లేయర్ ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సురేఖ-ఓజస్ రెండో రౌండ్‌లో 159-157తో మరియా-గైల్స్ (లక్సెంబర్గ్)లపై... క్వార్టర్ ఫైనల్లో 159-156తో సోఫీ-అడ్రియన్ గోంటీర్ (ఫ్రాన్స్)లపై... సెమీఫైనల్లో 157-155తో ఫాతిన్ నూర్‌ఫతే-జువైది (మలేసియా)లపై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో చెన్ యి సువాన్-చెన్ చియె లున్ (చైనీస్ తైపీ)లతో జ్యోతి సురేఖ-ఓజస్ తలపడతారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మాత్రం అతాను దాస్-భజన్ కౌర్ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లో 3-5తో డెన్మార్క్ జోడీ చేతిలో ఓడిపోయింది.



ధీరజ్ అద్భుతం...

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో ధీరజ్ 6-0తో థియో కార్బొనెటి (బెల్జియం)పై, రెండో రౌండ్‌లో 6-4తో కెజియా చాబిన్ (స్విట్జర్లాండ్)పై, మూడో రౌండ్‌లో 6-4తో జిగా రావ్నికర్ (స్లొవేనియా)పై, నాలుగో రౌండ్‌లో 6-5తో అమెరికా దిగ్గజం బ్రాడీ ఇలిసన్‌పై, క్వార్టర్ ఫైనల్లో 6-4తో తరుణ్‌దీప్ రాయ్ (భారత్)పై గెలుపొందాడు. ప్రపంచ మాజీ చాంపియన్, మూడు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ఇలిసన్‌తో జరిగిన మ్యాచ్‌లో ధీరజ్ 'షూట్ ఆఫ్'లో గెలిచాడు. ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేసినా ధీరజ్ కొట్టిన బాణం 10 పాయింట్ల లక్ష్యబిందువుకు అతి సమీపంలో ఉండటంతో విజయం ఖరారు చేసుకున్నాడు.

మే 28న అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్



న్యూఢిల్లీ: ఐపీఎల్ 16వ సీజన్ ప్లే ఆఫ్ దశ షెడ్యూల్‌ను బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది. మే 23న క్వాలిఫయర్-1 మ్యాచ్‌కు... మే 24న ఎలిమినేటర్ మ్యాచ్‌కు చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం వేదికగా నిలుస్తుంది. మే 26న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం క్వాలిఫయర్-2 మ్యాచ్‌కు, మే 28న ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సందీప్ లమిచానె రికార్డు



కీర్తిపూర్ (నేపాల్): వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 100 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నేపాల్ స్పిన్నర్ సందీప్ లమిచానె రికార్డు నెలకొల్పాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రీమియర్ కప్ టోర్నీలో భాగంగా ఒమన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సందీప్ మూడు వికెట్లు తీశాడు. తద్వారా 42 మ్యాచ్‌ల్లోనే 100 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా సందీప్ నిలిచాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (44 మ్యాచ్‌లు) పేరిట ఉండేది.

సెమీస్‌లో బోపన్న జోడీ



బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-2, 6-4తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)-ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

చెన్నై చమక్...

బాధ్యత లేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ భంగపడింది. పటిష్టమైన బౌలింగ్, కట్టుదిట్టమైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన చెన్నై సూపర్ కింగ్స్ ... సులభమైన లక్ష్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఛేదించింది. జడేజా స్పిన్ మ్యాజిక్, కాన్వే విలువైన ఫిఫ్టీతో చెన్నై ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసింది.

- సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్లతో విజయం
- తిప్పేసిన జడేజా
- మెరిపించిన కాన్వే


కాన్వే


జడేజా

చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై దూకుడు పెరుగుతోంది. హైదరాబాద్‌ను బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ ఇలా అన్నిరంగాల్లో కట్టడి చేసిన సూపర్‌కింగ్స్ 7 వికెట్లతో జయభేరి మోగించింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా 3 వికెట్లు తీశాడు. అనంతరం సూపర్ కింగ్స్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (57 బంతుల్లో 77 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. మార్కండేకు 2 వికెట్లు దక్కాయి.

జడేజా మాయ...

హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను ఎక్కడికక్కడ చెన్నై బౌలర్లు కట్టడి చేశారు. పవర్ ప్లేలో ఓపెనర్ హ్యారీ బ్రూక్ (13 బంతుల్లో 18; 3 ఫోర్లు) బౌండరీలతో వేగం పెంచినా... అంతలోనే ఆకాశ్ సింగ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. తర్వాత హిట్టర్ రాహుల్ త్రిపాఠి (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్) ఆడినా, కెప్టెన్ మార్క్‌రమ్ (12 బంతుల్లో 12; 1 ఫోర్) బ్యాటింగ్‌కు దిగినా... క్లాసెన్ (16 బంతుల్లో 17; 1 ఫోర్) క్రీజులోకి వచ్చినా... నిలిచింది కాసేపే! ధాటైన ఇన్నింగ్స్, చితగ్గొట్టే ఓవర్ ఒక్కటైన కనిపించలేదు. ఉన్నంతలో అభిషేక్ శర్మ చేసిన స్కోరే కాస్త మెరుగనిపించింది. అనుభవజ్ఞుడైన స్పిన్నర్ జడేజా కీలకమైన అభిషేక్, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్ (2) వికెట్లతో సన్‌రైజర్స్ స్కోరు ఏమాత్రం పెరగకుండా అడ్డుకున్నాడు.

కాన్వే ధనాధన్...

చెన్నై ముందున్న సులువైన లక్ష్యాన్ని రుతురాజ్ గైక్వాడ్ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు) బౌండరీతో మొదలుపెట్టాడు. డెవాన్ కాన్వే ధనాధన్ ఆటతో పరుగులు వేగంగా వచ్చాయి. మార్కో జాన్సెన్ వేసిన ఆరో ఓవర్‌ను కాన్వే అదేపనిగా దంచేశాడు. ఎదుర్కొన్న 5 బంతుల్ని 4, 4, 6, 4, 4లుగా బౌండరీలకు తరలించడంతో 23 పరుగులొచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో చెన్నై స్కోరు 60/0. టార్గెట్‌లో అటుఇటుగా సగం పనైపోయింది. 11వ ఓవర్లో రుతురాజ్ రనౌట్ కావడంతో 87 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన అజింక్య రహానే (10 బంతుల్లో 9; 1 ఫోర్), ఇంపాక్ట్ ప్లేయర్ అంబటి రాయుడు (9 బంతుల్లో 9; 1 ఫోర్) విఫలమైనా కాన్వే అజేయంగా నిలబడి జట్టును గెలిపించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్	6	3	3	6	-0.298
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ x లక్నో (మ. గం. 3:30 నుంచి)
ముంబై x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (సి) రుతురాజ్ (బి) ఆకాశ్ 18; అభిషేక్ శర్మ (సి) రహానే (బి) జడేజా 34; రాహుల్ త్రిపాఠి (సి) ఆకాశ్ (బి) జడేజా 21; మార్క్‌రమ్ (సి) ధోని (బి) తీక్షణ 12; క్లాసెన్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 17; మయాంక్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 2; జాన్సెన్ (నాటౌట్) 17; సుందర్ (రనౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 134. వికెట్ల పతనం:** 1-35, 2-71, 3-84, 4-90, 5-95, 6-116, 7-134. **బౌలింగ్:** ఆకాశ్ 3-0-17-1, తుషార్ దేశ్‌పాండే 3-0-26-0, తీక్షణ 4-0-27-1, మొయిన్ అలీ 2-0-18-0, జడేజా 4-0-22-3, పతిరణ 4-0-22-1.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (రనౌట్) 35; కాన్వే (నాటౌట్) 77; రహానే (సి) మార్క్‌రమ్ (బి) మార్కండే 9; రాయుడు (బి) మార్కండే 9; అలీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 138. వికెట్ల పతనం:** 1-87, 2-110, 3-122. **బౌలింగ్:** భువనేశ్వర్ 2-0-10-0, జాన్సెన్ 3-0-37-0, మార్క్‌రమ్ 1-0-11-0, సుందర్ 2.4-0-16-0, మార్కండే 4-0-23-2, ఉమ్రాన్ 3-0-18-0, డాగర్ 3-0-21-0.

సచిన్, కోహ్లి, రోహిత్‌ల 'బ్లూ టిక్' మార్క్ తొలగింపు

- ఈ జాబితాలో ధోని, సింధు, సైనా, సానియా, నిఖత్ జరీన్ తదితరులు
- డబ్బులు చెల్లిస్తేనే 'బ్లూ టిక్' సౌకర్యం కల్పిస్తున్న ట్విట్టర్



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ నెట్‌వర్క్ సైట్ 'ట్విట్టర్' సెలబ్రిటీలకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తదితర తారల ట్విట్టర్ ఖాతాలకు 'బ్లూ టిక్' మార్క్‌లను తొలగించింది. ఈ మార్కులు అధికారిక ఖాతా (వెరిఫైడ్ ఐడెంటిటీ) అనే ముద్ర కలిగి ఉంటాయి. ఇన్నాళ్లు సెలబ్రిటీలు, జర్నలిస్టులు, ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా 'బ్లూ టిక్ మార్క్'లను కల్పించింది. అయితే ఈ మైక్రో బ్లాగ్ సైట్‌ను టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కొనుగోలు చేశాక నిబంధనలు మార్చారు. ఇందులో భాగంగా ఇకపై (ఏప్రిల్ 20 నుంచి) చెల్లింపు ఖాతాలకే 'బ్లూ టిక్' మార్క్‌లు కేటాయించాలని ట్విటర్ నిర్ణయించడంతో క్రీడా దిగ్గజాలు, సినీ తారలు 'బ్లూ టిక్'ను కోల్పోయారు. సచిన్, కోహ్లిలే కాదు... ధోని, రోహిత్ శర్మ, సైనా నెహ్వాల్, నీరజ్ చోప్రా, బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, బాక్సర్ నిఖత్ జరీన్, సానియా మీర్జా, సునీల్ ఛెత్రి, పీఆర్ శ్రీజేశ్, అంతర్జాతీయ దిగ్గజాలు ఫెడరర్, రాఫెల్ నాదల్ (టెన్నిస్), క్రిస్టియానో రొనాల్డో, ఎంబాపె (ఫుట్‌బాల్), ఖాతాలకు కూడా 'బ్లూ మార్క్'లు కనిపించవు.

ఏమిటీ 'బ్లూ టిక్'?

సచిన్ లేదంటే ఇంకే హీరో పేరు మీద ఇతరులు కూడా నకిలీ ఖాతాలు తెరుస్తారు. కానీ అసలైన సచిన్ టెండూల్కర్ ట్విట్టర్ ఖాతా ఏదంటే మాత్రం 'బ్లూ టిక్'తో వెరిఫైడ్ ఐడెంటిటీ తేలిపోతుంది. ఇప్పుడీ అధికారిక ముద్ర కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. వెరిఫైడ్ ఐడెంటిటీ కావాలంటే వెబ్ పోర్టల్‌కు రూ. 650, మొబైల్ ఫోన్లకు రూ. 900 ప్రతి నెలా చెల్లించాలి. 'బ్లూటిక్' మార్క్ తొలగించడంతో సచిన్ తన అధికారిక ఖాతాలో జాతీయ పతాకాన్ని పెట్టుకొని ఇదే నా 'బ్లూ టిక్ వెరిఫికేషన్' అని కామెంట్ జత చేశాడు.